# ఆహ్వానం

ఇదుగో! – గులకరాళ్ళ మధ్యనే దొరుకుతుంటాయట వెలలేని వజ్రాలు.

నువ్వనవచ్చు–

'ఒక్కొక్క అప్పుడు వజ్రాలలా భ్రమింపజేస్తాయి గాని నిజానికి గులకరాళ్ళే' – అని.

– – –

కావచ్చు. కాదని మూర్ఖంగా వాదించే రకం కాదునేను. కాని అవి నిజంగా గులకరాళ్ళో ఒకవేళ వజ్రాలో – నువ్వు ఒకసారి ఆగి పరీక్షించి పదునుపెట్టి చూడాలి కదా!

అయినా నువ్వు వప్పుకోకుండా అంటావ్–

'నువ్వు యేదో మారుమూల కూర్చుని కబుర్లంటే చెబుతావ్. చిత్ర నిర్మాణంలో నీకేం అనుభవం వుంది' – అని.

కాని అక్కడ నువ్వు పొరపడుతున్నావు అంటాను. మా హోటల్లో ఇరవయ్యేని రూపాయలు పుచ్చుకొని మనుష్యమాత్రులు తినరాని తిండి పెడుతున్నాడు. వంకాయ కూర బాగా లేదనీ, అన్నం పలుకుగా వుందనీ, నెయ్యి దుర్వాసన వేస్తోందనీ పప్పు నీరు చప్పగావుందనీ మొదలయిన విషయాలు చెప్పడానికి వంట వండడం వచ్చి వుండాలా? అక్కరలేదు. రుచి తెలుసుకోగలిగితే బాలాది సహితం చెప్పవచ్చు. అంతేకాదు – యెందుచేత బాగాలేదో (అంటే వుప్పో కారమో యెక్కువయిందనో లేక వుడకడం చాలదనో) చెప్పి ఈసారి యిలా వుప్పు యింతకన్నా తక్కువ వేస్తే సరిపోతుందనో లేక యెక్కువ వెయ్యాలనో, మరి కాస్త బాగా వుడకాలనో కూడా బాగా చెప్పవచ్చు.మా అభిరుచికి సరిపడా పదార్థాలు తయారు చెయ్యమని హోటలు యజమానిని నిర్బంధించవచ్చు.

నేనిప్పుడు అటువంటి హక్కుతోనే మాటాడుతున్నాను.

మీరు, మా డబ్బు – మేం కష్టపడి సంపాదించిన డబ్బుతో బ్రతుకుతున్నారు.

హాయియయిన నిద్ర, కమ్మటి పానీయాలు, తృప్తికరమైన భోజనం, మొదలయిన జీవావసరాలకు యెంత ప్రాధాన్యత యిస్తున్నామో ఈనాడు సినీమాకుఅంత ప్రాధాన్యతా యిస్తున్నాము. కాని అసంతృప్తికరమైన చిత్రాలతో జీవితానందంలో లోటు కలుగుతోంది.

చక్కటి రిక్రియేషన్ కోసం, మా జీవితంలో ఖరీరీరీ అయిన అనుభవాలను జుజీశిరిరీశిరిబీగానైనా పొందడానికోసరం. మాకు తీరుబడి లేక ఆలోచించలేక పోయిన సమస్యల పరిష్కార మార్గం తెలుసుకోవడం కోసరం. మా కష్టార్జితంలో కొంత వెచ్చించి మీరు తీసి మాకు పంపించే చిత్రాలు చూస్తున్నాం. కాని మీలో చాలా మంది మా హోటలు మేనేజరులాగే మాకు యెంతో అసంతృప్తిని కలిగిస్తున్నారు. మీరు ఒప్పుకోక పోవచ్చు కాని మీరు మా కష్టార్జితాన్ని అన్యాయంగా అపహరిస్తున్నారు.

మా యిళ్ళల్లో అబ్బాయిలూ, అమ్మాయిలూ, అన్నదమ్ములూ, భార్యలూ, తల్లిదండ్రులూ వుంటారు. మా కష్టార్జితం తింటారు; మా కష్టసుఖాలకు ఆదుకుంటూ, మా ఆనందం, సౌఖ్యం, ఆరోగ్యం, అభివృద్ధీ లక్ష్యంలో పెట్టుకుంటూ ప్రవర్తిస్తారు. కాని కొందరు దౌర్భాగ్యులు మాకు నిరాశ, విసుగు, కోపం తెప్పించే మార్గాల పోతూవుంటారు. అయినా వాళ్ళను పోషించడం మానం. యెందుచేత? వాళ్ళు మా పిల్లలూ, మా వాళ్ళు. ఆ 'మా...' అన్న మమకారం వల్ల పోషిస్తున్నామే గాని వాళ్ళు చరించే మార్గం హర్షించి కాదు. కనీసం సహిస్తుండగలిగీ కాదు.

సరిగా ఆ సూత్రంపైనే మీకూ, మాకూ సంబంధం సాగుతోందంటాను.

మీరు మా తెలుగువాళ్ళు.

అదిగాక చాలా తక్కువగా తయారయే తెలుగు చిత్రాల కోసం కాచుకొని కాచుకొని వుంటాం. ఆకలి వేస్తున్నప్పుడుయే రసవిహీనమైనా, యే అనారోగ్యకరమయిన ఆహారమయినా ఆతృతతో తినేస్తాం. తర్వాత తిట్టుకుంటాం. ఒక్కో అప్పుడు 'బాగానే వుంది' అని కొంతమంది అన్నా నిజానికి అవి బాగుండవు, ఆకలి రుచి యెరుగదు. మొఖమాటం కూడా ఒక్కోఅప్పుడు అలా అనేటట్టు చేస్తుంది. తింటున్నారు కదా అని వుప్పు ఎక్కువా, కారం తక్కువా, సరిగా వుడకని పొళ్ళతోనే వండిపెట్టే హోటలు వాడిలాగ – మీరు కూడా చూస్తున్నారు కదా అని ఆ పురాణ గాథలూ, ఈ పుల్లమ్మ గాథలూ మా నెత్తిన రుద్దుతున్నారు. గరిక పచ్చడయినా రుచికరంగా చేసివుంటే కొంత సంతోషించి వుందుము. అదీ లేదు.

నేను చాలా అన్యాయంగా అబద్ధం చెపుతున్నానని మీరు అంటారు. మీరు అలా అనడానికి ఆధారం మీ బాక్సాఫీసులు. అంతేనా? అదే అయితే ఆ ఆధారం సుద్ధ నిరాధారం.

అవును పుల్లమ్మ చిత్రాల బాపతు మండుతున్న పేగులు ఒకటి – అదికాక–

Vices లోబడ్డ వాళ్ళకు తెల్సు – అవి దూష్యాలు అనీ, అటువంటి వాటికి లోబడడం. వాటి కోసరం ధనం వ్యయం చెయ్యడం తప్పు అనీ. పాపం వాళ్ళు వాటిని బహిష్కరిద్దామనే అనుకుంటారు. కాని ఆ అశక్తులు చెయ్యలేక పోతారు. అంతమాత్రాన వాళ్ళు Vicesని గౌరవిస్తున్నారనీ, వాళ్ళు అవే కోరుతున్నారనీ అంటావా?

కష్టపడి వళ్ళు పుండు చేసుకుని వచ్చే కార్మికులకు, హాయిగా మేను మరిపించే సౌఖ్యం, నిద్రా త్రాగుడు యిస్తుందంటూ మద్యపానాన్ని ప్రోత్సహించే వాదన ఒకటి విన్నాము ఆమధ్య. మరి నీ వాదన కూడా ఆ జాతికే చెందుతుంది. కాని నువ్వు వెళ్ళి ఒక త్రాగుబోతును అడిగి చూడు – తెలివితో వున్నప్పుడు సుమీ! – త్రాగుడు గురించి యెలాటి అభిప్రాయాలు ఇస్తాడో. దీనికీ అంతేనా అంటావు! ఆహా! రా! మా వూరు రా! అక్కడ యెంతోమంది – మిడిల్‌క్లాసు, మధ్యరకం వాళ్ళచేత, కొంతమంది తర్డ్‌క్లాసు వాళ్ళచేత కూడా ఋజువు యిప్పిస్తాను.

నేను యింతసేపూ చెపుతూ వచ్చినది నీతో ఈ విషయం చెప్పడానికే.

మేం డబ్బు యిస్తున్నాం. మేం అంటే మీ మెద్రాసులో కూర్చున్న వాళ్ళు ఒక్కళ్ళే కాదు – త్రిలింగ మధ్య ప్రదేశంలోని తెలుగు వాళ్ళం అందరం. మా కష్టార్జితం నువ్వు తింటున్నప్పుడు నువ్వు మా అభిరుచులను తెల్సుకుంటూ వాటిని అనుసరించి నీ ముందు అడుగు వెయ్యాలి కదా? మరేదీ నువ్వు ఒక్కనాడయినా మా అభిరుచులు తెల్సుకోవడానికి ప్రయత్నించావా? మెద్రాసులో నీ బృందం మధ్యన కూర్చుని వాళ్ళు యిచ్చిన అభిప్రాయాలను మాత్రం తెల్సుకొని వూరుకుంటున్నావు కాని యేనాడయినా మాలోకి, మా మధ్యకు వచ్చి మా అభిప్రాయాలు, అభిరుచులూ తెల్సుకున్నావా? ఒకవేళ వస్తే మాత్రం యెక్కడ కూర్చున్నావ్? – యెవరితో మాట్లాడావ్? బాక్సులో కూర్చుని నీ గొప్పతనానికి తైర్ కొట్టే బృందాన్ని అడిగావ్! మీకు డబ్బిస్తున్నది వాళ్ళా? వాళ్ళంతా ఓ.ఐ. బాపతు. మీకు యెక్కువ భాగం డబ్బు యిస్తున్నది మేమూ, మా మిడిల్‌క్లాస్, మా తర్డ్‌క్లాస్ – నువ్వు రావలసేది మా మధ్యకు.

చెప్తున్నాను. పశువులలో కూడా అగపడే 'విశ్వాసం' అనేది నీలో యేమయినా వుంటే – నువ్వు మనిషివని చెప్పుకోదలిస్తే బయలుదేరు. నువ్వు తినే డబ్బు యెవరైతే యెక్కువ భాగం యిస్తున్నారో ఆ ప్రేక్షకుల మధ్యకు వెళ్ళు. నీ హోదాతో కాదు – సాధారణ సోదర ప్రేక్షకుడిగా – వెళ్ళి వాళ్ళు నీ చిత్రాన్ని యెలా ఆనందిస్తున్నారో చూడు. యెప్పుడు తిడుతున్నారు? యెప్పుడు నిషాలో మునిగి తప్పుడు కూతలు కూస్తున్నారు? యెప్పుడు నిశ్శబ్దంగా కూర్చున్నారు? అని గమనించు. ఆట అయాక బయటికివచ్చే ప్రేక్షకుల రిమార్కులు విను – యింకా భోగట్టా చెయ్యి. అప్పుడు ఈసారి తియ్యవలసే చిత్రం గురించి ఆలోచించు.

ఆ చంద్రతారార్క కీర్తిశేషుడు – యావద్భారత పూజితుడు – "రాజారామ్" ప్రజానురంజకతకు మూలం ఈ మార్గమే. ఒకసారి జ్ఞాపకం తెచ్చుకో.

ఒక్కమాట జ్ఞాపకం వుంచుకో. ప్రేక్షక లోకం అంటే నువ్వూ, నీ బృందం, నేనూ, నా పత్రిక యెడిటర్ గారూ మాత్రమే కాదు – మీ మెద్రాసు ప్రేక్షకులూ, మన యావదాంధ్ర దేశపు ప్రేక్షకులూ మాత్రమేకాక యింకా యెంతోమంది.

★

*(రూపవాణి: మార్చి, 1946)*